క్లుప్తంగా

విద్యుత్ తీగలు సరిచేయాలి



పాఠశాల ఆవరణలో పడి ఉన్న విద్యుత్ తీగెలు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం పంచాయతీ చినరావుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలు పడి ఉన్నాయి. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. గత ఐదు రోజులుగా తీగెలు పడి ఉన్నా సరిచేయలేదు. అధికారులు స్పందించి విద్యుత్ తీగలు సరిచేయాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

జి.సిగడాం: మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సోమవారం రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామంలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరవుతారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ ఆదివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాలు, గ్రామ స్థాయిలో రానున్న రోజుల్లో అనుసరించాల్సిన అంశాలపై సమావేశం ఉంటుందన్నారు. గ్రామ, మండల స్థాయి కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



అరుణకుమారి

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామానికి చెందిన రాష్ట్ర బీసీ కార్పొరేషన్ (శిష్టకరణ) డైరెక్టర్ వాండ్రంగి అరుణకుమారి తన పదవికి ఆదివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సంబంధిత శాఖ అధికారులకు పంపించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు అరుణకుమారి తెలిపారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్



ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌ను అభినందిస్తున్న చంద్రబాబు

రణస్థలం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును ఢిల్లీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్‌ను చంద్రబాబు అభినందించారు.

కూర్మనాథున్ని దర్శించుకున్న అనకాపల్లి ఎస్పీ



స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథున్ని అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సతీ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజల నంతరం శ్రీకూర్మనాయకుని, వైష్ణవిదుర్గ, రెండు ధ్వజస్తంభాలను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, కిశోర్‌బాబు క్షేత్రమహాత్యాన్ని తెలియజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సర్వవేదాంత సారం భాగవతం



వక్త ప్రసాదరావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సర్వవేదాంత సారం భాగవతమని, సమస్త పురాణాలలో భాగవతం ఉత్తమమైనదని వక్త రంగడు ప్రసాదరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో మద్భాగవతంలోని దశమ స్కందంలో 'అక్రూరుని భక్తి ప్రపత్తిత' అనే అంశంపై ఆదివారం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంసుడు చేసే రుద్రయాగమునకు ఆహ్వానించేందుకు అక్రూరుని పంపగా, అక్కడి బలరామకృష్ణుల వైభవాన్ని తిలకించి అనుభూతిని చెందాడని తెలిపారు. ముందుగా వక్త ప్రసాదరావును మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మందిరం ఉపాధ్యక్షులు పతంజలి శాస్త్రి, సాయి ప్రసాదరావు, ఈశ్వరరావు, విశ్వేశ్వరరావు, జోగారావు, సరస్వతి ఉన్నారు.

కాలభైరవస్వామికి అలంకరణ



బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాలాత్రిపుర కాలభైరవ స్వామి పీఠం ఆలయంలో ఆదివారం సందర్భంగా కాలభైరవస్వామివారికి గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. అనంతరం స్వర్ణాకర్షక భైరవ స్వామిని ప్రత్యేక అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

గాయత్రీ మాతకు పూజలు





శ్రీకాకుళంలోని నాగావళి కొత్తబ్రిడ్జి ఒడ్డున ఉన్న చిం దత్తనాథ క్షేత్రంలో ఆదివారం గాయత్రీ మాతకు అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అర్చకులు సింహాచలం శర్మ ఆధ్వర్యంలో అనఘా సమేత దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకాలు చేశారు. జయలక్ష్మి మాతృమండలి ఆధ్వర్యంలో మహిళలచే సామూహిక లలితాసహస్ర నామ పారాయణ, గాయత్రీ జపం, హోమం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గవర గోవిందరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

నివాళులు



ఈనాడు గ్రూపుసంస్థల అధినేత రామోజీరావు మృతిపై రెడ్‌క్రాస్ ప్రతినిధులు సంతాపం తెలియజేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు, మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతాకల్యాణ్ అనురాగ నిలయంకు రూ.5 లక్షల విలువైన పరికరాలను రామోజీరావు అందించారని గుర్తు చేశారు. కమిటీ సభ్యులు డాక్టర్ నిక్కు అప్పన్న, నిక్కు హరిసత్యన్నారాయణ, పి.శ్రీకాంత్, కల్యాణచక్రవర్తి, బి.చిన్మయరావు, నర్సింగరావు, గుణాకరరావు, సతీష్, రమణ పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

వైభవంగా మద్వేంకటనాయక స్వామి మహోత్సవం



స్వామివారి తీరువీధిలో భక్తజనం



పూజలందుకున్న స్వామివారు

గార: మండల కేంద్రం గారలోని మద్వేంకటనాయక స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వక్షేన ఆరాధనతో ప్రారంభమైన కార్యక్రమం 108 లీటర్ల ఆవుపాలతో స్వామివారికి అభిషేకం, అనంతరం నిజరూప దర్శనం, హోమాలు, శ్రీవారి అలంకరణ మహోత్సవం, అన్నసమారాధన జరిగింది. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను గార పుర వీధుల్లో అధిక సంఖ్యలో భక్తులు వెంటరాగా తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. మేళతాళాలు, భజనలు, గోవిందనామ స్మరణతో గ్రామమంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ అర్చకులు జాడ సునీల్‌శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కింతలి కృష్ణారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరి వెదలు వేసేందుకు సిద్ధం



కలిగాం వద్ద వరి వెద వేసేందుకు సిద్ధం చేసిన పొలం

కొత్తూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి వెదలు వేసేందుకు రైతులు తమ పొలాలను దుక్కిలు చేసి సిద్ధంగా ఉంచారు. పదునైన వర్షాలు కురిసిన వెంటనే వరి విత్తనాలు వేయనున్నారు. దుక్కులతోపాటు మేక, గొర్రెల మందలు, గత్తం వేశారు. మండలంలో ఐదు వేల హెక్టార్లలో వరి సాగు చేస్తుండగా అందులో సుమారు మూడు వేల హెక్టర్లలో వరి వెదలు చల్లనున్నారు. వర్షాభావం కారణంగా రైతులు వెదలు వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రతీ గ్రామంలో దమ్ములు కంటే వెదలు వేయడం ఎక్కువ చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో మరింత ఎక్కువ విస్తీర్ణంలో వరి వెదలు వేసేందుకు రైతులు తమ పొలాలను దుక్కులు చేసుకొని పనులు పూర్తిచేశారు. వెదలు చల్లడం వల్ల ఉడుపులు, ఆకుతీత, దమ్ములు చేయడంతోపాటు పలు రకాల పనులకు పెట్టుబడి అవసరం లేకపోవడంతోపాటు తక్కువ పెట్టుబడితో సాగు చేయడం జరుగుతుంది. నాట్లు వేసిన వరి చేసు కంటే వెద చేనుకి వర్షం తక్కువ శాతం కురిసినా పంట చేతికి అందుతుందన్న నమ్మకంతో రైతులు వెదలు వైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి



ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పాపతట్నం: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, విద్యార్థులర ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని పాపతట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సనపల వైకుంఠరావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులతో కలిసి మండలంలోని ప్రహరాజపాలెం, సీతారాంపల్లి, గోపాలపురం, బూరగాం తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. పాఠశాలలో పదో తరగతిలో విద్యార్థులు సాధించిన ఫలితాలు, మౌలిక సదుపాయాలు గూర్చి తల్లిదండ్రులకు వివరించారు. సకల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎన్.టి.రామారావు, కోటేశ్వరరావు, కల్యాణరాజు, జగన్, పాల్గొన్నారు.

లయన్స్ సేవలు విస్తృతం చేస్తాం



మాట్లాడుతున్న సదాశివుని కృష్ణ

నరసన్నపేట: మండల పరిధిలో లయన్స్ క్లబ్ సేవలు మరింతగా విస్తృత పరుస్తామని క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ అన్నారు. నరసన్నపేటలో ఆదివారం క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో శాశ్వత స్థాయిలో క్లబ్ సేవలు విస్తృత పరుస్తామని హామీ నిచ్చారు. ఇప్పటికే చేపట్టిన సేవా కార్యక్రమాల నివేదికను కార్యదర్శి నాగరాజు అందించారు. రానున్న సంవత్సరానికి అధ్యక్షుడిగా రమణసాహు, కార్యదర్శిగా కె.సాయిరాంను ఎన్నుకున్నట్లు కృష్ణ తెలిపారు. కొత్త కార్యవర్గం జూలై నుంచి బాధ్యతలు స్వీకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బోయిన బాలకృష్ణ, ఊణ్న రంగనాథ్, సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాల నిలుపుదల



మడపాం టోల్‌గేట్ ముందు నిలిపిన వాహనాలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై మడపాం టోల్‌గేట్ వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా నిలపడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. టోల్‌గేట్ దాటిన తరువాత, ముందు ఒకేలా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వచ్చిపోయో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారుల కష్టాలు అయితే వర్ణనాతీతం. ఏ వాహనం ఎలా వచ్చి ఢీకొంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెళ్లేందుకు సరైన మార్గం కూడా ఉండటం లేదు. పోలీసులు స్పందించి వాహనాలు క్రమ పద్ధతిలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు, స్థానికులు కోరుతున్నారు.

16 నుంచి వెంకన్న వార్షిక కల్యాణ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని చిన్నబజారులో ఉన్న దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు వార్షిక కల్యాణ వేడుకలు జరగనున్నాయి. ఈ విషయాన్ని ఆలయ అర్చకులు రేజేటి వెంకట శ్రీనివాసాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు, కల్యాణ వేడుకలు జరుగుతాయని.. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని దోమాం గ్రామంలో గల లలితాదేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. పాలాభిషేకం, పంచామృతం, కుంకుమపూజలు నిర్వహించారు. దేవీ ఆశ్రమం అర్చకులు, వంశీకుమార్, ఆలయ ధర్మకర్త నర్సింగరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన బాలసంస్కార్ తరగతులు



సామూహికంగా పాద పూజ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో నెలరోజులుగా వేసవి సెలవుల సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన బాలసంస్కార్ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రులకు పాదపూజా కార్యక్రమం సామూహికంగా నిర్వహించారు. హిందూ ధర్మం కోసం వివరణ, భగవద్గీత వల్లించడం, పెద్దలతో మాట్లాడడం, నడచుకునే విధానంపై అంశాలను బోధించారు.

నేటినుంచి ఆలయ వార్షికోత్సవం

ఆమదాలవలస: మండలంలో వంజంగి గ్రామంలో గల ముకుంద తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం స్వామివారికి క్షీరాభిషేకం, అఖండ దీపారాధన, మండప ఆరాధన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. బుధవారం స్వామివారి చక్రతీర్థస్నానాలు, పుర్ణాహుతి, ఇతర పూజలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

కూర్మనాథ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



క్యూలైన్‌లో ఉన్న భక్తులు

గార: శ్రీకూర్మనాథాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూరం నుంచి వచ్చిన భక్తులు ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవాలయం, వైష్ణవీదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. దేవస్థానంలో జరిగే నిత్యన్నదానంలో 300 భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు రెండు క్యూలైన్ల ద్వారా స్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు.

నైతిక విలువల విద్య అవసరం



సర్టిఫికెట్లను అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఆమదాలవలస: నేటి ఆధునిక యుగంలో లౌకిక విద్యతోపాటు నైతిక విలువున్న విద్య విద్యార్థులకు ఎంతో అవసరమని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ విద్యాజ్యోతి ఇన్‌చార్జ్ ఎస్.వి.గురుప్రసాద్ అన్నారు. పట్టణంలో గల లక్ష్మీనగర్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వేసవి సెలవులు నేపథ్యంలో 40 రోజులపాటు కంప్యూటర్ శిక్షణ పూర్తిచేసిన 42 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కంప్యూటర్ శిక్షణ విద్యార్థులకు రానున్న రోజుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, జిల్లా గ్రామ సేవా ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, భజన మండలి కన్వీనర్ చిన్నబాబు, ఎస్.వాసుదేవరావు, దామోదర్ పటాన్నాయక్, బండి ప్రతిమ పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ నాయకుల సంబరాలు



మెళియాపుట్టి: మూడు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



హిరమండలం: కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

మెళియాపుట్టి: శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కడంపై మండలానికి చెందిన కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో ఆదివారం కేక్ కత్తిరించి మిఠాయిలు పంచిపెట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాతోపాటు పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకెళ్తుందని తెలిపారు.

హిరమండలం: కేంద్రంలో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన ధర్మారావు ఆధ్వర్యంలో, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. బాణసంచా కాల్చారు.

అపూర్వ కలయిక



మండల కేంద్రం గారలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-95 విద్యా సంవత్సరాల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులంతా ఒక చోట కలుసుకున్నారు. ఆదివారం సమీప శాలిహుండం వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కుటుంబ సభ్యులు, అప్పటి గురువులతో కలిసి రోజంతా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులు బి.వాసుదేవరావు, బి.మోహనరావు, గోవిందరావు, అనసూయ, సూర్యప్రకాష్, సీహెచ్. గోవిందరావులను ఘనంగా సత్కరించి గౌరవించారు.

-గార